# ప్రమోషన్

తలవైపున నల్లగా మాసివున్న పడక కుర్చీలో కూర్చున్నాడు అప్పుడే ఆఫీసునుండి వచ్చిన ప్రకాశరావు.

"చేతిలో ఆకవరేమిటి" అంది రుక్మిణి.

"కోరా పుట్టి ట్రాన్స్ఫర్ చేశారు. ఆ ఆర్డరిది" అన్నాడు.

* * *

ప్రకాశరావుకి యిద్దరు మగపిల్లలూ, ఒక ఆడపిల్లా. పిల్లలు ముగ్గురూ చక్కనివాళ్ళే. ఆడపిల్లకి సంవత్సరం యింకా పూర్తి కాలేదు. వయస్సుకి తగ్గ పుష్టి, పచ్చని చాయ, పాలబుగ్గలు, యెర్రగా లక్క పూసినట్లున్న పెదిమెలు, వుంగరాలు తిరిగిన నల్లని విగ్గులాంటి జుట్టుతో పిల్ల చూడ ముచ్చటగా వుంటుంది. మగపిల్లలిద్దరూ మంచిచురుకైనవాళ్ళు. వాళ్ళ లేత బుర్రలలో యెన్నో వూహాలు, ధర్మ సందేహాలు బయలుదేరేవి. "అద్దంలోని పాపాయి యెవరో! చంద్రుడు, సూర్యుడు, నక్షత్రలు మనమీద పడిపోతే యెల్లాగ? అన్ని మాటలూ మనకి వచ్చునుకదా. మరి మేష్టారెందుకు? బాల, చందమామలాంటి పత్రికలు మనం యెందుకు నడపకూడదూ?"

ఇలాంటి మాటలు అన్నదమ్ములిద్దరూ అనుకుంటూండేవారు. సాయంత్రం వాళ్ళ నాన్న వచ్చాక యెన్నో అడుగుదామనుకుంటారా యిద్దరూ. బండెడు కాగితాలు చంకనెట్టుకుని, రోజల్లా శ్రమించి, యిల్లు చేరిన ప్రకాశరావు యిల్లంటూ కళ్ళబడిందని అనుకుంటూ భార్యయిచ్చిన కాఫీతాగి పడకకుర్చీలో మేనువాలుస్తాడు. ముఖాన్ని యేకాస్త నవ్వు కనబడినా దగ్గరకు వెడదామని చూస్తూంటారు ఆ కుర్రాళ్ళిద్దరూ. వాళ్ళకి తండ్రి పరిస్థితి తెలియదు. కాని, తల్లి సాయంత్రం నాలుగుగంటలనుండి "నాన్నగారు వస్తారు. విసుగ్గా వుంటుంది. అల్లరి చెయ్యకండి" అని చేసే బోధవల్ల దగ్గిరకి వెళ్ళడానికే వాళ్ళకి భయం. ఒక్కొక్కప్పుడు మెల్లిగా వెళ్ళి దగ్గర నిలబడతారు. ఒళ్ళో కూర్చోడానికి ప్రయత్నించబోతారు. "ఇప్పుడే వచ్చానో లేదో అప్పుడే నెత్తిమీద కెక్కాలీ? అవతలకి పొండి" అనే తండ్రి కేకలతో బిక్కమొగాలు వేసి తల్లి వెనక్కాల చేరేవారు. "అల్లా యెందుకు వెళ్ళారు? పాపాయి మీరు యెంచక్క ఆడుకోండి" అని వాళ్ళ అమ్మ బొమ్మలిచ్చి, తినడానికి యేదైనా పెడితే ఆనందంగా వెళ్ళిపోయేవారు. పసిపిల్ల సరోజ పాకుతూ వచ్చి ప్రకాశరావు కుర్చీ పట్టుకుని నిలబడేది నవ్వుతూ. అతనది గమనించేవాడే కాదు. అంతలో రుక్మిణివచ్చి "అదేమిటి! పాపాయి వచ్చి నుంచుంటే పలకరించరేం?" అంటే "అల్లాగా! చూడలేదు" అని చేతితో పిల్ల బుగ్గమీద రోలేన్ పేపరుమీద సంతకం పెట్టినట్టు చిటికవేసి 'దీన్ని తీసుకొనివెళ్ళు' అనేవాడు.

**శ్రీమతి**
**వేదుల మీనాక్షీదేవి**

ఆ చిరాకుకి అంతంలేదు. పిల్లలన్నా, వాళ్ళ మాటలన్నా, ఆటలన్నా ఆసక్తిలేదు. పసిపిల్లనెన్నడూ యెత్తుకున్న పాపాన పోలేదు. సాధ్యమైనంతమట్టుకు పిల్లలు అతని చుట్టుపక్కలకిరాకుండానే చూస్తూండేది రుక్మిణి.

ఒకనాడు ప్రొద్దున్న సావిట్లో కూర్చుని కాగితాలు చూసుకుంటున్న ప్రకాశరావుని "ఏమండీ" యింట్లో వుప్పూ, పప్పూ, చింతపండుతో సహా అన్నీ అయిపోయాయి. ఒక్కమారు బజారుకివెళ్ళి నాలుగూ తెస్తే మళ్ళీ నెలదాకా వెళ్ళక్కర్లేదు" అంది భయపడుతూ రుక్మిణి.

"నువ్వు రాగానే అనుకున్నాను యేదో పని చెబుతావని, నీ బజారు వెచ్చాలతోను, పిల్లల అల్లరితోను బాధపడలేకపోతున్నాను." అని విసుక్కుంటూ సగం సగం త్రాగిన కాఫీ క్రింద పెట్టేశాడు.

రుక్మిణి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"వెళ్ళక్కర్లేదు లెండి, కాఫీ తాగండి" అని బతిమాలుకుంది. ప్రకాశరావు కాఫీ తాగాడు.

ఇది వుంది, అది లేదు అన్నమాట లేకుండా భర్తని యిబ్బందిపెట్టకుండా కాలక్షేపం చేసేది రుక్మిణి. అతనికి బజారు పనికూడా లేకుండా చేద్దామని దాసీదానికి చాటుగా ఓ అణా డబ్బులిచ్చి కావలసిన వస్తువులు తెప్పించుకునేది. వస్తువులు శుభ్రమైనవి. ధర సమంగా వుండేది. పరిమాణం కూడా సరిపోయేది. ఇదీ బాగానే వుందనుకుంది. అలా కొన్నాళ్ళు గడిచింది.

క్రమంగా దుమ్ములాంటి సరుకులు రావడం, వెనకటికంటే ఖరీదు యెక్కువవడం, వస్తువులుకూడా తక్కువగా వుండడం జరుగుతోంది. పనిమనిషి తక్కువ ధరకి పాడువస్తువులుకొని, యెక్కువధర చెప్పి ఆ సొమ్ము మిగుల్చుకుని, వస్తువులలో కూడా కాస్త కాస్త తీసుకుంటున్నట్టు అనుమానం కలిగింది రుక్మిణికి. ప్రత్యక్షంగా చూడనప్పుడు అడగడం మంచి పని కాదు. మంచో చెడ్డో ఆరుమాసములనుండీ తెస్తోంది. అదీగాక అడిగితే ప్రయోజనం శూన్యమేకాకుండా భర్తకి తెలిస్తే చివాట్లు. పనిమనిషి యిన్నాళ్ళనుండి తెస్తున్నట్లు ప్రకాశరావుకి తెలియదు.

ప్రకాశరావు జజారుకివెళ్ళి ఆరుమాసాలయింది. ఇన్నాళ్ళనుండి బజారుకి వెళ్ళకపోతే తనభార్య యెల్లాగడుపుకొని వస్తోందో, కొంపలో యేం చిక్కుగా వుందో అసలైనా అతనికి తోచలేదు. అతని కాగొడవేలేదు. పోనీ యింతకాలం ఐంది కదా అని భర్తకి బజారుపనిచెప్పి చివాట్లు తింది రుక్మిణి.

ప్రకాశరావు గ్రాడ్యుయేటు. ఆ డిగ్రీతప్ప వేరే ఆధారంలేదు. ఉద్యోగంకోసం ప్రకాశరావు యెక్కని గుమ్మంలేదు. అడగని అధికారి లేడు. ఆ చెవిగాడుపు యీ చెవికి కొట్టే రోజుల్లోకూడా విధీ విరామం లేకుండా తిరిగాడు. ఆరుమాసములా విధంగా తడిమన్ను పొడిమన్నయేలా తిరగ్గా తిరగ్గా ఓ ఆఫీసులో కాంపుగుమాస్తా వుద్యోగం దొరికింది. జీతం, కరువు భత్యంతో నూరు కిడుతుంది. అదే పదివేలనుకుని పుట్టింటినుండి భార్యాబిడ్డలను తీసుకువచ్చి ఓ చిన్న యిల్లు 15 రూపాయల కద్దెకు తీసుకుని వున్నాడు.

దొరక్క దొరక్క దొరికిన వుద్యోగం. ఇది నిలువుకుంటేగాని ప్రాణాలు నిలవవు. ఏవిధంగానైనా అధికారి ఆదరణకు పాత్రుడవాలి. ఆవిధంగా ఆదరణ పొందగలిగిననాడు అధికారి తనకు జీతం హెచ్చు చేయించవచ్చు. ప్రస్తుతం తను చిన్న గుమాస్తా. సమయంవస్తే హెడ్‌గుమాస్తాని చెయ్యవచ్చు. ఇలాంటి వూహాలు ప్రకాశరావు మనస్సులో పరుగులెత్తాయి. అధికారి ఆదరం సంపాదించడానికి వారి యింటికి వెళ్ళి ఆ యింట్లో వాళ్ళకి మంచిగా ప్రవర్తించడమే సాధనం అనుకున్నాడు.

రోజూ వుదయం వాళ్ళింటికి వెళ్ళి వాళ్ల పిల్లలతో మెల్లిమెల్లిగా పరిచయం చేసుకున్నాడు. ఇంట్లోని పెద్దవాళ్ళకికూడా పరిచయస్థుడై "ప్రకాశరావు మంచివాడు" అనిపించుకునేందుకు ఆట్టే కాలం పట్టలేదు. ఆఫీసరుగారి భార్యను "పిన్నిగారూ" అని పిలిచేవాడు ప్రకాశరావు.

ప్రకాశరావు మామూలుగా ప్రొద్దున్నే ఆఫీసరుగారి యింటికి వెళ్లాడు. గుమ్మంలో అడుగు పెట్టాడో లేదో లోపలినుండి "ఏమోయీ ప్రకాశరావూ నిన్న స్నో, ఫేస్ పౌడరు, సెంటూ తెమ్మని చెప్పాను తేలేదేమి?" అని అడిగింది అధికారి వినాయకరావుగారి సతీమణి.

ప్రకాశరావు నాలిక కొరుక్కున్నాడు తేనందుకు.

"ఔను. మీరు చెప్పారు పిన్నిగారూ. నిన్న యింటికి వెళ్ళేసరికి చాలా చీకటి పడిపోయింది. తలనొప్పిగా వుండి సరాసరి యింటికి వెళ్ళిపోయాను. ఈపాటికి బజారులోని కొట్లు తీస్తారు. మీరిచ్చిన చీటి జేబులోనే వుంది. ఇప్పుడే తెస్తాను" అన్నాడు అతి వినయంగా.

'వెళ్ళేవాడ వెల్లాగ వెడుతున్నావు గనక ఒక వీశ లేత నీటివంకాయలు తెచ్చిపెట్టు. నే నిచ్చిన సొమ్ములో సరిపోతుందిలే" అంది ఆ యిల్లాలు.

"అల్లాగే"నంటూ బజారుకి వెళ్ళి కొనవలసినవన్నీ వంకాయలతో సహా కొని అధికారి యింట్లో అప్పగించి యింటిముఖం పట్టాడు ప్రకాశరావు.

ప్రొద్దున్న రుక్మిణి ఉప్పు, పప్పులాంటి అవసర వస్తువులు తెమ్మంటే విసుక్కున్నాడు. వినాయకరావుగారి గృహిణి తెమ్మన్న విలాసవస్తువులు గడగడలాడుతూ తెచ్చియిచ్చాడు. తోవ పొడుగునా చాలా బాధపడ్డాడు. భార్య చెప్పిన వస్తువులు కొంటే పదిరూపాయ లవుతాయి. చేతిలో చిల్లిగవ్వ లేదు. విసుక్కోక ఏం చెయ్యాడం?

వినాయకరావుగారింట్లో ఒక సీమకుక్క వుంది. తెల్లగా మిసమిసలాడుతూ, కుదిమట్టంగా వుంటుంది. ప్రకాశరావుకి పిల్లి, కుక్క, యెలక అంటే పరమరోత. అన్నం తినేటప్పుడు అవి కనబడితే లేచి వెళ్ళిపోయేవాడు. అలాంటి ప్రకాశరావుకి అధికారియింట్లో కుక్క ఒక సమస్య అయిపోయింది. ప్రత్యేకంగా దాని



## ★ ప్రవాహం ★

కొక టేబిల్ వేయించారు. ఆ కుక్కని దాని మీద కూర్చోబెడతారు. దానినంతా ప్రేమిస్తున్నారు. దానిని పక్కలో పడుకో పెట్టుకుంటారు. పసిపిల్లనెత్తుకున్నట్లు ఎత్తుకుంటారు. మూతి మీదముద్దెట్టుకుంటారు. ఇదంతా చూస్తూంటే ప్రకాశరావుకి వాంతివచ్చే పర్యంతం అయేది. అవేవీ తను చెయ్యకపోయినా ఆ కుక్క దగ్గిరనైనా నుంచుంటేగాని బాగుండదు.

ఎల్లాగో ముళ్ళమీద నుంచున్నట్లు దాని దగ్గిర నిలబడేవాడు పది నిముషాలు. అప్పుడప్పుడు సావిట్లో దాన్ని వీధి గుమ్మం



HVM. 189-X52 TL

లోకీ వీధి గుమ్మంలో దాని యింట్లోకి తీసుకు వెళ్ళేవాడు.

ప్రకాశరావు వచ్చాడనగానే ఆ యింట్లోని పిల్లలంతా చుట్టూచేరేవారు. తన పిల్లలు వచ్చీరానిమాటలు ముద్దుగా మాట్లాడుతుంటే వినిపించుకోక విసుక్కునే ప్రకాశరావు అధికారి ఆశ్రయింపుకోసం వాళ్ళ పిచ్చిపిచ్చి ప్రశ్నలకు సమాధానం చెబుతూ వాళ్ళతో పిల్లవాడిలాగ ఆడుతూ వాళ్ళ నానందపరచేవాడు. అందమైన తన పసిపిల్ల సరోజనే నాడూ ముద్దుపెట్టుకోనివాడు మెట్టనుదురు, చప్పిడి ముక్కుతో వికారంగావున్న వినాయకరావుగారి రెండేళ్ల పిల్లవాడిని తెగముద్దు పెట్టుకునేవాడు. మనస్సులో యెంతో బాధపడేవాడు.

ఆనాడు ఆదివారం. సెలవుగనక తలంటి నీళ్ళుపోసుకుంటారా అనే రుక్మిణి మాటలను వినిపించుకోకుండా వినాయకరావు గారింటికి వెళ్లిపోయాడు. మామూలుగా పిల్లలు చుట్టూచేరారు. వాళ్లతో కథలూ, కబుర్లూ చెబుతూ కాలక్షేపం చేస్తున్నాడు. వినాయకరావుగారు కనబడక పోవడంవల్ల పిల్లల నడిగి వుదయాన్నే ఆయన యెక్కడికో వెళ్ళారని తెలుసుకున్నాడు. 11 గంటలైంది. ఆకలేస్తోంది. ఆఫీసరుగారొచ్చాక కనబడి వెడదామనుకున్నాడు. పిల్లలొక్కొక్కరే భోజనం చేసి వచ్చారు. కుక్కకు భోజనం వేళ అవడంవల్ల రొట్టె, పాలు తెచ్చి దానిముందు టేబిల్ మీద పెట్టి వెళ్లింది వాళ్ళఅమ్మాయి. ఇంతలో వినాయకరావుగారు వచ్చిన సవ్వడి అయింది. ఇదే సమయం అనుకుని ప్రకాశరావు రొట్టెముక్కను పాలలో ముంచి కుక్కకు తినిపించడం మొదలు పెట్టాడు. బల్లమీదవున్న కుక్కనీ, కింద కూర్చుని దానికి రొట్టెను తినిపిస్తున్న ప్రకాశరావునీ చూశాడు వినాయకరావుగారు. ప్రకాశరావు లేచి నమస్కారం చేసి సెలవు తీసుకున్నాడు.

ఆశ్రయింపుకోసం కుక్కకు రొట్టె తినిపించిన ప్రకాశరావు కాపూట తిండిలేదు. అసహ్యంతో తినలేకపోయాడు. చేతులు సబ్బుపెట్టి కడుక్కున్నా, లోషన్ నీళ్ళతో కడుక్కున్నా అసహ్యంగానే వుంది.

ఈ విధంగా ఒక సంవత్సరం గడిచింది. కట్టుకున్న యిల్లాలి కష్టసుఖాలు తెలుసుకోకుండా వూరివారి సంసారతాపత్రయంతో సతమత మౌతున్నాడు. కన్నబిడ్డలను కన్నెత్తి చూడకుండా, వారితో ఆనందించనివాడు పరులబిడ్డలను క్రిందకు దింపకుండా మోస్తున్నాడు. వారి జంతువులకు కూడా నీచాతి నీచమైన పనులు చేస్తున్నాడు. ఇదంతా తన దరిద్రంవల్లకదా! అదే ఆస్తిపరుడైతే యీ ఆశ్రయింపు అవసరం వుండదు. స్వేచ్ఛ అనుభవించవచ్చు.

ప్రకాశరావు యీ విధంగా బాధపడుతూవున్నాడు మానసికంగా చాలా.

"ఎల్లాగో ఒక సంవత్సరం ఆశ్రయించాము. అదంతా వూరికే పోదులెండి" అనే భార్య వూరడింపు వాక్యాలతో తృప్తిపడేవాడు.

ఆఫీసులో హెడ్ గుమాస్తా పని ఖాళీ వచ్చింది. ఆ వుద్యోగం తన కిమ్మని దరఖాస్తు పెట్టుకున్నాడు ప్రకాశరావు. తన కాపని యిప్పించమని వినాయకరావుగారిని స్వయంగా అడిగాడు.

ఇన్నాళ్ళు ఆత్మగౌరవం చంపుకుని చేసిన సేవకు తగినఫలితం లభించబోతున్నదని ఆ దంపతులిద్దరూ ఆనందించారు.

ఆఫీసులో కూర్చుని పోస్టువాడిచ్చిన కవరు ఆత్రంగా చదువుకున్నాడు. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. కలా, నిజమా అని సందేహం కలిగింది. నాలుగు వైపులా చూశాడు. తను ఆఫీసులో వున్నట్టు గ్రహించగలిగాడు కొంతసేపటికి. ముచ్చెమటలు పోశాయి.

* * *

తలవైపు సల్లగామాసివున్న పడకకుర్చీలో కూర్చున్నాడు అప్పుడే ఆఫీసునుండి వచ్చిన ప్రకాశరావు.

"చేతిలో ఆ కవరేమిటి?" అంది రుక్మిణి.

"కోరాపుట్టి ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ ఆర్డరిది" అన్నాడు.

"అయితే హెడ్ గుమాస్తాపని యిస్తారనుకుంటున్నాంకదా. ఆపని యిస్తానే బదిలీ చేశారా?"

"అదేంకాదు. హెడ్ గుమాస్తాకి బదిలీ అయిందిట. ఆయన స్థానంలో మరొక ఆయన యిక్కడికి బదిలీ చేయబడ్డాడు. ఇవ్వాళే వచ్చాడా కొత్త గుమాస్తా, నా బదిలీ విషయం వేరు. "అస్తమానం పిల్లలతోను, కుక్కలతోను ఆడుకునేవాడు యిక్కడ పనిచెయ్యలేడు" అని వినాయకరావుగా రామయ్య వెనకటి హెడ్ గుమాస్తాతో అన్నారని కర్ణాకర్ణిగా విన్నాను. అది నిజమో కాదో. అస్తమానం వారింట్లో వుంటున్నాననీ, నేనంటే వారందరికీ అభిమానమనీ ఓర్చలేక యెవరైనా పుట్టించారేమో ఆమాట అని అనుకున్నాను. ఆయన అనడం నిజమేనని నా బదిలీవల్ల తేలుతోంది స్పష్టంగా. ఇన్నాళ్ళూ మనం చేసినసేవ పసిపిల్లలతో గడ్డుమన్యాలలో వుండి నానాబాధలూ పడవలసిన పరిస్థితులు రావడానికి అయిందన్నమాట. ఇదే మనకి వచ్చిన ప్రమోషన్" అన్నాడు నిట్టూర్పు విడుస్తూ ప్రకాశరావు.

★

తల్లి తండ్రులు చూసిన పిల్లను పెళ్ళి చేసుకోవటం మంచిదా, లేక మనమే ఓ పిల్లను చూసి పెళ్ళిచేసేసుకోవటం మంచిదా - అనే సమస్యపై మా కాలేజిహాస్టల్‌లో ఒకనాడు హోరాహోరి వాదనలు చెలరేగాయి.

మాహాస్టల్‌లో వంటచేసే వెంకట్రాముడు - బాగా పెద్దవాడు-ఎప్పుడోవచ్చి మాతో బాటే కూర్చుని మా వాదనలన్ని విన్నాడు. చివరకు యిలా అన్నాడు:

"తల్లితండ్రులు నిర్ణయించిన పిల్లను పెళ్లి చేసుకొంటే, అట్టివారి జీవితంలో వచ్చే సుఖాల్ని, చల్లని పాలను క్రమంగా మసలబెట్టటంతో పోల్చుకోవచ్చును. మనమే పిల్లనివెదికి పెళ్ళిచేసుకొంటే, పొంగే పొంగే పాలను చల్లారబెట్టుకొన్నట్లే, వాళ్ళ జీవితంలో సుఖంకూడా త్వరలోనే చప్పబడిపోతుంది."

**కుష్ఠు ★ బొల్లి**

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.